క్లుప్తంగా

మహనీయుల ఆశయాలను కొనసాగించాలి



భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లాంటి మహనీయుల ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో మహనీయుల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నొస్సం నరసింహులు విప్లవ వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో నాటి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారి పోరాటం ఎనలేనిదన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆర్‌యూ నాయకులు సురేష్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ పరీక్షకు 1029 మంది హాజరు

కర్నూలు (సెంట్రల్): ఏపీపీఎస్సీ నిర్వహించిన కాలుష్య నియంత్రణ మండలిలోని అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ నియామక పరీక్షకు 1029 మంది హాజరయ్యారు. మంగళవారం కర్నూలులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, సనత్ నగర్‌లోని అయాన్ డిజిటల్, ఎమ్మిగనూరులోని సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీల్లో నిర్వహించిన అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ పరీక్షకు 2,075 మందికి గాను 1029 మంది హాజరయ్యారు. 1046 మంది గైర్హాజరయ్యారు.

రైతుల ఆస్తులు జప్తు చేయడం ఆపాలి

కర్నూలు(సెంట్రల్): కేంద్ర సహకార బ్యాంకు, సొసైటీలు రైతులకు ఇచ్చిన రుణాల రికవరీ పేరుతో ఆస్తులను జప్తు చేసి అవమానించడం ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మంగళవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చిప్పగిరి మండలం బెల్డోన, నగరడోన గ్రామాలతోపాటు ఆలూరులో రైతుల ఆస్తులు, ఇళ్లలో ఉన్న వస్తువులను జప్తు చేసి అవమానిస్తున్నారన్నారు. అప్పులు చెల్లించడానికి కొంత సమయం ఇవ్వాలని రైతులు కోరినప్పటికీ పట్టించుకోకుండా తీవ్ర మనోవేదనకు గురి చేయడం సమంజసం కాదన్నారు. జిల్లాలో కరువు ఛాయలతో ఆలూరు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో లక్షలాది కుటుంబాలు వలసలు వెళ్లాయని, ఇలాంటి సమయంలో అప్పుల జప్తు పేరుతో బ్యాంకులు దారుణంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే ప్రభుత్వం కలుగజేసుకొని రుణాల రికవరీని నిలుపుదల చేయాలని, లేకుంటే రైతులకు అండగా పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

హాస్టల్‌లో రాత్రి బస

కర్నూలు (రూరల్): కర్నూలు మండల పరిధి గార్గేయపురం గ్రామంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో మంగళవారం రాత్రి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మద్దిలేటి రాత్రి బస చేశారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతూ చదువులు ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు. శ్రద్ధగా చదువుపై దృష్టి పెట్టి త్వరలో జరగబోయే పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. అదే విధంగా హాస్టల్‌లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా, హాస్టల్‌లో సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ డి.మదారి పాల్గొన్నారు.

పట్టణ మహిళా సమాఖ్య సమావేశం



సమావేశమైన పొదుపు సంఘాల మహిళలు

కల్లూరు: కల్లూరులోని సీఆర్‌సీ బిల్డింగ్‌లో మంగళవారం లిటిల్ రోజెస్ పట్టణ మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన టీఎల్‌ఎఫ్ ఓబీ ఎన్నికపై చర్చ జరిగింది. 45 ఐక్య సంఘాల ఓబీలు హాజరుకాగా 40 ఐక్య సంఘాల ఓబీలు పాత ఓబీలైన టి.కుల్లాయమ్మ, కె.లక్ష్మి కొనసాగాలని నిర్ణయించారు. అయితే మెప్మా సీఎంఎం అధికారి కొత్తగా సోమశేఖరమ్మ, వీరనాయణమ్మ, కె.లక్ష్మీదేవిలను కొనసాగించాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఐక్య సంఘాల సభ్యులు ఆరోపించారు. ఈ అంశంపై మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా బైలా ప్రకారం మూడు సంవత్సరాలకు ఒక్కసారి తప్పనిసరిగా ఓబీలను మార్చాలని తెలిపారు.

నేడు మునిసిపల్ కార్యాలయం ముట్టడి

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కర్నూలు మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నారు. ఈనెల 14వ తేదీ నుంచి నగరంలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రజా చైతన్య యాత్రల ద్వారా వారు తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10 గంటలకు మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నారు.

రక్షణ



శక్తి యాప్ వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయలక్ష్మి

కర్నూలు: మహిళలు అత్యవసర సమయంలో శక్తి ఎస్‌ఓఎస్ యాప్‌ను వినియోగించుకోవాలని కర్నూలు మహిళా పీఎస్ సీఐ విజయలక్ష్మి సూచించారు. సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మంగళవారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సీఐ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శక్తి టీమ్ పనితీరు, శక్తి ఎస్‌ఓఎస్ యాప్ ఉపయోగాలు, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్, డయల్ 112, 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, కర్నూలు పోలీస్ వాట్సాప్ 77778 77700, సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ 1930 ఉపయోగాలు, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, సోషల్ మీడియా ప్రభావం, చదువుకు ఉన్న ప్రాముఖ్యత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళ శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారి మొబైల్ కంట్రోల్ రూమ్ కు కనెక్ట్ అవుతుందని, ప్రమాదంలో గానీ, అత్యవసర సమయంలో గానీ మొబైల్‌ను ఐదుసార్లు షేక్ చేస్తే కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వెళ్తుందన్నారు. దగ్గర్లోని పోలీసులు ఐదు నిమిషాల్లో బాధిత మహిళ వద్దకు వచ్చి సహాయం చేస్తారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శాంత, లెక్చరర్లు పల్లవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

అవగాహన



విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్ పనితీరును వివరిస్తున్న పోలీసు

కర్నూలు: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని వారి చేత వినూత్న తరహాలో ప్రచారం చేయించారు. కోల్స్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులను రాజ్‌విహార్ సెంటర్‌కు రప్పించి సిగ్నల్ లైట్ల పనితీరు, పోలీసులు ట్రాఫిక్‌ను ఎలా నియంత్రిస్తారు, జీబ్రా లైన్లు ఎలా దాటాలి తదితర అంశాలపై అవగాహన కల్పించి విద్యార్థుల చేత కూడా ట్రాఫిక్ పోలీసుల తరహాలో విధులు నిర్వర్తింపజేశారు. ఇలా ప్రతిరోజూ ఒక పాఠశాలకు చెందిన విద్యార్థులను ప్రధాన కూడళ్లకు రప్పించి ట్రాఫిక్ నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు విధిగా సీటు బెల్టు ధరించాలని ఇప్పటికే ప్రధాన కూడళ్లలో మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

ఆదర్శం



తాహెరా బేగంకు బహుమతి అందిస్తున్న వీసీ పీఎస్‌షా వలిఖాన్, రిజిస్ట్రార్ లోకనాథ

కర్నూలు కల్చరల్: రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ – 2025 పోటీలకు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఎంఎస్సీ జువాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని షేక్ తహెరా బేగం ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ పీఎస్‌షా వలిఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ ఆమెను అభినందించి భారత రాజ్యాంగ పుస్తకాన్ని బహూకరించారు. వీసీ మాట్లాడుతూ 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' అనే అంశంపై జిల్లాస్థాయిలో 150 మంది విద్యార్థులు పోటీపడగా 10 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారన్నారు. ఇందులో తమ విద్యార్థి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు. ఆమెకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారులను అభినందించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పాల్‌కృపాకర్, డాక్టర్ ఎస్.ఎస్.ఎం.హుస్సేని, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం



రైతులతో సమావేశమైన ఆర్డీఓ, అధికారులు

కర్నూలు(రూరల్): నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు, ఏపీఐఐసీ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. ముచ్చుమర్రి పంపింగ్ స్టేషన్ నుంచి ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌కు ఏపీఐఐసీ వాటర్ పైప్‌లైన్ గార్గేయపురం, పూడిచెర్ల, కేతవరం గ్రామాల్లో పొలాల్లో వెళ్తున్నందున భూములు కోల్పోయే రైతులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయం తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లడుతూ.. రైతుల అభిప్రాయాలను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రానికి సమీపాన వెంకాయపల్లె వద్ద వెలసిన ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

గ్యాస్ సిలిండర్ పేలుడులో గాయపడ్డ వ్యక్తి మృతి

ఆలూరు రూరల్: వంట గ్యాస్ సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడిన గురుస్వామి (40) అనే వ్యక్తి మంగళవారం కోలుకోలేక కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ మహబూబ్ బాషా వెల్లడించారు. మండలంలోని కురువళ్లి గ్రామమానికి చెందిన గురుస్వామి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. శనివారం రాత్రి వంట చేసిన తరువాత గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేయడం మరిచిపోయారు. 23వ తేది ఆదివారం తెల్లవారు జామున చుట్టు పక్కల ఇళ్లవారు మీ ఇంట్లో గ్యాస్ వాసన వస్తోందని చెప్పడంతో గురుస్వామి లైట్ వేయడంతో లీకైన గ్యాస్ ఒక్క సారిగా పేలడంతో గురుస్వామి (40)తో పాటు ఇంట్లో నిద్రిస్తున్న కుమారుడు ధర్మకు తీవ్రగాయాలయ్యాయి. భార్య గాయత్రి స్వల్పంగా గాయపడింది. గ్రామస్తులు ఆలూరు ఆసుపత్రిలో చేర్పించారు. క్షతగాత్రులను చికిత్స అందించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం ఆదోని ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ ఓ ప్రవేటు ఆసుత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి మరింత విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం 3 గంటలకు మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన కుమారుడు ధర్మ, భార్య గాయత్రి పరిస్థితి కూడా విషమంగా ఉంది. ప్రస్తుతం వీరు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు.

పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ

కర్నూలు (టౌన్): నగరంలోని ప్రజలు చెల్లించాల్సిన పన్ను బకాయిలపై ప్రభుత్వం 50 శాతం వడ్డీ మాఫీ ప్రకటించిందని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ 46 ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. కొంత మంది పన్ను దారులు ఏళ్ల తరబడి పన్నులు చెల్లించడం లేదని, ప్రతిఒక్కరూ పన్నులు చెల్లించాలని కోరారు. చెత్త సేకరణ, వ్యర్థాల తొలగింపు, పూడికతీత పనులు, రహదారుల శుభ్రత, శునకాల బెడద నియంత్రణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రహదారుల నిర్వహణ, ఉద్యాన వనాల నిర్వహణ, మురుగు కాల్వల నిర్మాణాలకు నిధులు అవసరం ఉంటుందని వివరించారు. మొండి బకాయిదారులు ఈ నెలాఖరులోపు పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా నిలిపివేయడం, షాపులు సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రయోజనాలు పొందుతూ పన్నుల చెల్లింపును జాప్యం చేయడం తగదన్నారు. సత్వరమే పన్నులు చెల్లించాలని కోరారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



స్కాలర్‌షిప్ మెగా చెక్కును అందజేస్తున్న వై.పరమేశ్వర రెడ్డి, తదితరులు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ చదువుతున్న పేద విద్యార్థులకు మలబార్ గోల్డ్ సంస్థ ఏటా అందజేసే స్కాలర్‌షిప్‌ను మంగళవారం అందజేశారు. బిక్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా వృత్తివిద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు చెక్కులను అందజేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ.. మలబార్ ట్రస్ట్ ద్వారా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 209 మంది విద్యార్థులకు రూ.18,64,000 చెక్కు రూపంలో అందజేశారన్నారు. ఒకేషనల్ కాలేజీకి చెందిన విద్యార్థులకు 20 మందికి సహాయం అందిందన్నారు. వివిధ కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): 50 ఏళ్లు దాటిన రైస్‌మిల్లు కార్మికులకు కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని ఆయిల్ అండ్ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైస్, ఆయిల్ మిల్లుల కార్మికులకు సగం రోజులు పని ఉంటే.. సగం రోజులు పనులు ఉండటం లేదన్నారు. పంటల సీజన్‌ను బట్టి కార్మికులకు పనులు దొరుకుతుండడంతో పస్తులు ఉండాల్సి వస్తోందని వాపోయారు. మరోవైపు పనులు ఉన్న సమయంలో కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైస్ బ్యాగ్‌లను 50 కేజీలు, 25 కేజీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా యాజమాన్యాలు మాత్రం 100 కేజీలు, 75 కేజీల బ్యాగులనే వినియోగిస్తున్నారన్నారు. ఆయిల్, రైస్‌మిల్లు కార్మికుల సంక్షేమ కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.నరసింహులు, సీహెచ్ సాయిబాబా పాల్గొన్నారు.

30న ఉగాది సంబరాలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సీక్యాంప్ కళాక్షేత్రంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలను నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా తెలిపారు. కృష్ణ బృందంచే నాదస్వర కచేరి, వేద పండితులు భాను స్వామిచే పంచాంగ శ్రవణం, నృత్య గురువు కరీముల్లా శిష్య బృందంచే సంగీతం, నృత్య ప్రదర్శనలు, ప్రముఖ కథా రచయిత ఇనాయతుల్లా బృందంచే ఉగాది కవి సమ్మేళనం ఉంటాయన్నారు. అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన 9 మంది ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యా రంగంలో జి.పుల్లయ్య, పద్య నాటకంలో పి.దస్తగిరి, సంగీతంలో గీతాంజలి, సాహిత్యంలో జంధ్యాల రఘుబాబు, నృత్యంలో పి.మీనాసాయి, జర్నలిజంలో మండిరాజు శ్రీనివాస రాజు, హరికథలో మంజుల, చిత్రలేఖనంలో దాసరి వెంకట రమణ, వాస్తులో యం.వినీలాకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఎన్నికలను పక్కాగా నిర్వహించండి

కర్నూలు (అర్బన్): జిల్లాలోని వివిధ స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీకై ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం జెడ్పీలోని తన చాంబర్‌లో జిల్లాలోని వెల్దుర్తి, తుగ్గలి, కృష్ణగిరి మండలాలకు చెందిన అధికారులు, ప్రిసైడింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. కృష్ణగిరి మండలంలో కో–ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఉందని, అలాగే జెడ్పీ కో–ఆప్షన్ సభ్యునితో పాటు తుగ్గలి, వెల్దుర్తి మండల పరిషత్ అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. నిర్ణీత సమయంలోగా నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటినీ పూర్తి చేసి బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాలను ప్రకటించాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయా పదవులను భర్తీ చేసేందుకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో వెల్దుర్తి, తుగ్గలి ప్రిసైడింగ్ అధికారులు కె.తులసిదేవి, డాక్టర్ కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వేల మందికి అన్నదానం

కర్నూలు(అగ్రికల్చర్): శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివారి క్షేత్రానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తులకు కర్నూలు విశ్రాంత ఉద్యోగుల సంఘం రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టింది. రెండు రోజుల్లో దాదాపు 2000 మందికి అన్నదానం ద్వారా ఆకలి తీర్చింది. ప్రతి ఒక్కరికీ లీటరు మజ్జిగ బాటిల్‌ను కూడా అందజేయడం విశేషం. రెండవ రోజు వెంకాయపల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, గౌరవాధ్యక్షుడు మోహన్‌సింగ్, జయచంద్రారెడ్డి, కోశాధికారి గోవిందరాజులు, ఇతర నాయకులు ఆంజనేయులు, జయశంకర్‌రెడ్డి, సదాశివుడు, ఎల్‌వీఎస్‌నాయుడు, బాలకృష్ణయ్య, నూగూరు వెంకటేశ్వర్లు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. సంఘంలోని సభ్యులందరి సహకారం వల్ల ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టినట్లు అధ్యక్షుడు రంగారెడ్డి తెలిపారు. సమష్టిగా అందిస్తున్న సహకారం వల్ల సేవా కార్యక్రమాల్లో రాణిస్తున్నట్లు వెల్లడించారు.

డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వం విఫలం



అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): రాష్ట్రంలో డ్రగ్స్‌ను నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రఘువేంద్ర ఆరోపించారు. ఈ.తాండ్రపాడు గ్రామంలో మంగళవారం భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, నాయకులు గ్రామ సర్పంచ్ బాలపీర ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లడుతూ.. ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసి, ప్రతి స్కూలులో అన్ని సబ్జెక్టులకు టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేలా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ బాలపీర మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతన సవరణ తక్షణం అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న బీమా ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీల ఉద్యోగులు, అధికారుల వేతన సవరణ చట్టాన్ని అమలు చేయకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం అత్యంత దారుణమైన విషయమని హైదరాబాద్ ప్రాంతీయ బీమా ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జే.రఘుబాబు మండిపడ్డారు. మంగళవారం కర్నూలులోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నేషనల్ ఇన్సూరెన్స్, న్యూ ఇండియా, ఓరియంటల్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీల్లోని అధికారులు, ఉద్యోగుల వేతన సవరణ 2022 ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉందన్నారు. వేతన సవరణను పట్టించుకోకుండా మెండికేసిన యాజమాన్యాలు, ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ ఈ నెల 27న ఒక్క రోజు సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. జాయింట్ ఫోరం నాయకులు నాగరాజు, శివకుమార్, జయశ్రీ, కృష్ణ, అస్లాంబాష, రంగనాథ్, మహేశ్వరరెడ్డి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న పోక్సో స్పెషల్ జిల్లా జడ్జి రాజేంద్రబాబు

కర్నూలు(రూరల్): పోక్సో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసినట్లు పోక్సో కోర్టు స్పెషల్ జిల్లా జడ్జి రాజేంద్రబాబు తెలిపారు. మంగళవారం కర్నూలు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, అంగన్‌వాడీ టీచర్లకు పోక్సో యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి రాజేంద్రబాబు మాట్లాడుతూ.. లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం–2012 ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. పిల్లలకు ఏదైనా సమస్య ఎదురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు కాల్ చేసి చెప్పవచ్చన్నారు. సదస్సులో తాలూకా అర్బన్ ఏఎస్ఐ గోపాల్, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరముడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎస్సీ హాస్టల్ వార్డెన్ మాదురి పాల్గొన్నారు.

శ్రీశైల పాదయాత్రికుల సేవలో ఆశ్రయ ట్రస్ట్





పాదయాత్రికుల కాళ్ల నొప్పులకు మసాజ్ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కర్నూలు(అర్బన్): శ్రీశైలంలో వెలసిన భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి దర్శనార్థం వందల కిలో మీటర్ల నుంచి కాలినడకన వస్తున్న భక్తులకు ఆశ్రయ ట్రస్ట్ అనేక రూపాల్లో సేవలందిస్తోంది. అవధూత నాదానంద్ తీర్థ్ సూచనల మేరకు డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రొఫెసర్లతో పాటు వివిధ రంగాల్లో సేవాభావం ఉన్న 15 మంది సభ్యులతో ఈ బృందం ఏర్పడింది. వీరంతా ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి వంద మంది వలంటీర్ల ద్వారా నాలుగైదు రోజులుగా శ్రీశైల పాదయాత్రికులకు సేవలందిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమాలు ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతాయని ట్రస్ట్ కోశాధికారి హెచ్‌డీ ఈరన్న తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. భక్తులకు కాళ్ల నొప్పులకు మసాజ్ చేయడం, కాలి గాయాలకు నిష్ణాతులైన డాక్టర్లచే వైద్యం చేయిస్తున్నామన్నారు. అలాగే అల్లోపతి, హోమియోపతి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ మందులను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. పాదయాత్రికులకు ఎనర్జీ డ్రింక్, మజ్జిగ, బిస్కట్లతో పాటు భోజనం అందించడంతో పాటు వారు సేదతీరేందుకు టెంట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

హుండీ ఆదాయం లెక్కింపు



గోరంట్ల మాధవస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 10 రోజుల్లో భక్తులు హుండీల్లో ద్వారా సమర్పించిన కానుకలతో పాటు ఇతర మార్గాల ద్వారా మొత్తం రూ.16,29,899 వచ్చినట్లు ఆలయ ఈఓ గుర్రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలోని తాత్కాలిక, పర్మినెంట్ హుండీల్లోని కానుకలను లెక్కించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,46,100, అన్నదానం చందాలు రూ.74,710, తాత్కాలిక అంగళ్ల ద్వారా రూ.37,230, పర్మినెంటు హుండీ ద్వారా రూ.5,54,446, అన్నదానం హుండీ ద్వారా రూ.2,78,436, తాత్కాలిక హుండీ ద్వారా రూ.5,38,977 వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. గతేడాది రూ.10,38,825 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.16,29,899 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలియజేశారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్



ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవనంలో ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, రాష్ట్ర పూర్వపు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.షణ్ముర్తి, హెచ్.తిమ్మన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ సంఘంలోనూ లేని విధంగా అన్ని కులాలు, మతాల సంస్కృతులను గౌరవిస్తూ ప్రతి సంవత్సరం ఎస్టీయూ కర్నూలు జిల్లా శాఖ క్రిస్మస్ క్యాండిల్ లైట్, సంక్రాంతి ముగ్గుల పోటీలు, ఇఫ్తార్ విందు కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పండగ ఏ మతానికి సంబంధించినదైనా దాని వెనుక ఒక సందేశం దాగి ఉంటుందని, అలాగే రంజాన్ పండగ వెనుక మానవాళికి మంచి చేసే ఉద్దేశం ఉందని, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనలను ప్రజలకు బోధిస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, రాష్ట్ర మాజీ కార్యదర్శి మహమ్మద్ షఫీ, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ ముదాసిర్ అహ్మద్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.